క్లుప్తంగా

వితరణ



తాగునీటి యంత్రాన్ని ఆస్పత్రి అధికారులకు అందిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, సంస్థ ప్రతినిధులు

డెంకాడ: ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీతో బాధపడుతున్న రోగులకు పలువురు ఉపాధ్యాయులు హెచ్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు చేతులమీదుగా సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అలాగే డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాగునీటి సౌకర్యార్థం తాగునీటి యంత్రాన్ని కూడా వితరణగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, టీబీ కంట్రోలర్ అధికారి సత్యనారాయణ, హెచ్ఎస్ ఫౌండేషన్ మూర్తి, రోజారమణి, వైద్య సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, తదితరులు

విజయనగరం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే మండల పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.అరుణకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను స్పందనలో తెలియజేసేటట్లు చూడాలన్నారు. అనంతరం పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బంగారయ్య మాట్లాడుతూ, ఫిర్యాదులను పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్, ఏఓ ఎం.సూర్యనాయుడు, ఏపీఓ ఆదిబాబు పాల్గొన్నారు.

'స్పందన'ను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్జీదారుల నుంచి వినతుల స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందించాలని సూచించారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా'

నెల్లిమర్ల: మండలానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా రుణమాఫీ కింద మూడో విడతగా మంజూరైన రూ.7.83 కోట్ల విలువైన చెక్కును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఛత్రపతి శివాజీకి నివాళులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయ ప్రాంగణం ఆవరణలో ఛత్రపతి శివాజీ 344వ వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు, గ్రంథాలయ ఉద్యోగుల సంయుక్త నిర్వహణలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.సతీష్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులో ఐదు శాతం రాయితీ

- ఏప్రిల్ 30 లోపు చెల్లించే వారికి అవకాశం
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించేవారికి ఐదు శాతం పన్ను రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఈ నెల 30లోపు చెల్లించే వారికి రాయితీ అవకాశం వర్తించనుంది. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి బకాయిలు ఉండకూడదు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.43.49 కోట్ల డిమాండ్‌కు గాను రూ.35.16 కోట్లు వసూలైంది. అదేవిధంగా నీటి పన్నుకు సంబంధించి రూ.1.69 కోట్లు, ఖాళీ స్థలాల పన్ను రూ.3.74 కోట్లు వసూలైనట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. తాజాగా నెల రోజుల పాటు అమలు చేసే ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ పథకాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు దృష్టి సారిస్తున్నారు.

సొంత ఆదాయం తప్పనిసరి...

స్థానిక సంస్థల ద్వారా సేవలు అందించాలన్నా.. పారిశుధ్యం, అభివృద్ధి పనులు చేయాలన్నా.. ఒప్పంద కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించాలనా సొంత ఆదాయం కీలకం. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు పన్నుల వసూలుపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో ఆస్తిపన్నుదే ప్రధాన వాటా.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంఘ నిధులు మంజూరు కావాలన్నా, ప్రత్యేక గ్రాంట్‌లు రావాలన్నా ఆస్తి పన్ను, ఇతర పన్నులు వసూలు చేసి చూపించాల్సి ఉంటుంది.

ఇంటి యజమానులకు ఊరట..

ఆస్తిపన్ను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఊరట ఇస్తోంది. నూతన ఆర్థిక సంవత్సరంలో పన్ను మొత్తం చెల్లిస్తే మళ్లీ బకాయిలు ఉన్నాయని పురపాలక శాఖ అధికారులు వచ్చి ఇబ్బందులు పెట్టే అవకాశం ఉండదు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రెండేళ్లుగా భారీ సంఖ్యలో ఇంటి యజమానులు ముందస్తుగా పన్ను చెల్లించి లబ్ధి పొందుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తి పన్నులో ఐదు శాతం రిబేట్ అవకాశాన్ని పురపాలక శాఖ కల్పించింది. నెలాఖరు వరకు గడువు ఉండగా కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్లో, ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు వీలుంది. దీనికి గడువు పెంచరు. వెంటనే చెల్లించుకోవాలి.
– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకుని హాల్‌టికెట్లు సరిచూసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డెంకాడ మండలంలో ముగ్గురు.. పూసపాటిరేగలో ఏడుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.
–డెంకాడ/పూసపాటిరేగ/భోగాపురం



పూసపాటిరేగ: రెల్లివలస పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు



పూసపాటిరేగ : జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు



భోగాపురం: పరీక్ష రాసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరావు



డెంకాడ: పెదతాడివాడ మెర్సీమిషన్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

స్త్రీ,శిశు సంక్షేమానికి ప్రాధాన్యం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: స్త్రీ, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తూ, కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక వీటీ అగ్రహారంలోని ఫంక్షన్ హాల్లో పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి. శాంతకుమారి, కార్పొరేటర్ శ్రీను, సీడీపీఓ డోకుల భారతి, జి. ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు..



కిట్‌లు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తదితరులు

- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ

పూసపాటిరేగ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అధ్యక్షతన సచివాలయం కన్వీనర్లకు 'జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పతివాడ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల ముంగిటకు పాలన తీసుకువచ్చారని కొనియాడారు. ప్రతిపక్ష పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని పిలు పునిచ్చారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, ఎన్.సత్యనారాయణరాజు, పి.లక్ష్మీ నారాయణ, దాడిశెట్టి త్రినాథరావు, రౌతు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'బోటు షికారు పునరుద్ధరించాలని విన్నవించా'

నెల్లిమర్ల: తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారును పునరుద్ధరించాలని కోరుతూ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, ఎం.డి కన్నబాబులకు వినతిపత్రాలు అందజేసినట్లు ఆ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అరకు పర్యాటక ప్రాంతంలో టూరిజం గెస్ట్‌హౌస్‌లకు మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు బోర్డు అంగీకారం తెలిపిందన్నారు.

వేడుకగా వేణుగోపాలస్వామి తిరుక్కల్యాణ సేవ



తిరుక్కల్యాణ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పాంచాహ్నక ధ్వజారోహణ తిరుక్కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పవన్‌స్వామి, టీటీడీ వేదపండితులు అనంత వెంకట జగన్నాథాచార్యస్వామి, ప్రసాద్‌శర్మ, నరసింహమూర్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం స్వామివారిని శేషవాహనంపై తిరువీధి నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. 5న రథోత్సవం, 6న పూర్ణాహుతి కార్యక్రమాలు, గరుడ వాహన సేవ, 7న పుష్పాంజలి, పవళింపు సేవ ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణే లక్ష్యం

విజయనగరం రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నీటిఎద్దడి నివారణే లక్ష్యంగా బోరుబావుల ప్రత్యేక మరమ్మతుల (క్రాస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు విజయనగరం మండల ప్రత్యేకాధికారి ఎం.అరుణకుమారి అన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పాడైన బోరుబావులకు మరమ్మతులు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి అరుణకుమారి, తదితరులు

కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భవానీ, మండల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



అయ్యన్నపేటలో తాగునీటి పైప్‌లైన్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని అయ్యన్నపేట ప్రాంతంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 44వ డివిజన్ అయ్యన్నపేటలో రూ.4 లక్షలతో చేపట్టనున్న పైపులైన్ల పనులకు రాజవీధి, కొత్తవీధి ప్రాంతాలలో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, నగరంలోని ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యవేక్షణలో రూ. 3.50 కోట్లతో 50 అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డు పర్యటనలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, జోనల్ ఇన్‌చార్జ్ దూబే, తమ్ము, కోఆప్షన్ సభ్యులు రహీం, వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలి



సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన డీఈ గోవిందరావు

చీపురుపల్లి: జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు (సోక్ పిట్లు) నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోవిందరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం జరిగే విధంగా చూడాలన్నారు. వీటి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఇళ్లల్లో వినియోగించే నీరు ఇంకుడు గుంతల్లో వెళ్లడం ద్వారా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఇంజినీరింగ్ అసిసెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వీటి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణంరాజు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపండి



చీపురుపల్లి: వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్

బొండపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో ప్రజలు అందించే ప్రతీ అర్జీని పరిశీలించి, అవకాశం ఉన్న మేరకు త్వరితగతిన పరిష్కారం చూపాలని మండల అధికారులకు ఎంపీపీ చల్లా చలం నాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీర్డీ సుగుణాకరరావు, ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

చీపురుపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికే 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా కేంద్రంలోనే స్పందన కార్యక్రమం ఉండేదని, ప్రజల సౌకర్యార్థం కొద్ది రోజులుగా మండల స్థాయిలోనూ ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎవరైనా వినతులు అందించవచ్చు

గజపతినగరం: ఏ సమస్యపై అయినా, ఎవరైనా స్పందనలో వినతులు అందించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. జిన్నాం గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు తనకు పింఛన్ ఇప్పించాలని, గ్రీన్ అంబాసిడర్లు జీతాలు పెంచాలని వినతులు అందజేశారు.తహసీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి రెండేళ్లు పూర్తి



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వార్డు మెంబర్లు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ పాలకవర్గం ఏర్పడి సోమవారం నాటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మేజర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, 20 మంది వార్డు మెంబర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మాట్లాడుతూ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి రెండేళ్లలో పంచాయతీని అభివృద్ధి పథం నడిపించామని మిగిలిన కాలంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంగళగిరి శ్రీను, పంచాయతీ అధికారి ఝాన్సీ, సిబ్బంది రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.